సాక్షి
అనంతపురం
మంగళవారం ၊ 11 ၊ మార్చి ၊ 2025



చీనీ టన్ను రూ.21,500

అనంతపురం మార్కెట్‌యార్డులో సోమవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.21,500 పలికాయి.



నాడు హామీలు.. నేడు అరెస్టులా?

చంద్రబాబు సర్కారు తీరుపై అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరితే అరెస్టులు చేయిస్తారా అని నిలదీశారు. 8లో



న్యూస్‌రీల్

బాధ్యతల స్వీకరణ



కలెక్టర్‌కు పూలమొక్క అందజేస్తున్న ఐసీడీఎస్ పీడీ నాగమణి

అనంతపురం సెంట్రల్: మహిళా,శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ)గా నాగమణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా మంత్రాలయం సీడీపీఓగా పని చేస్తున్న ఈమెకు పదోన్నతి కల్పించి జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమించిన విషయం విదితమే. సోమవారం అనంతపురంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో పీడీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

'పొరపాట్లకు తావివ్వొద్దు'

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ పరీక్షల నిర్వహణలో చిన్న పొరపాటుకూ తావివ్వొద్దని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా సోమవారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు గణితం పేపర్–2బీ, జువాలజీ పేపర్–2, హిస్టరీ పేపర్–2 పరీక్షలు జరిగాయి. నగరంలోని వివేకానంద జూనియర్ కళాశాల కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎలాంటి ఇబ్బంది లేకుండా జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. వసతుల కల్పనపై రోజూ సంబంధిత అధికారులతో మాట్లాడాలని ఆర్ఐఓను ఆదేశించారు. కాగా, పరీక్షలకు జనరల్ విద్యార్థులు 16,623 మందికి గాను 16,367 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 1,780 మందికి గాను 1,737 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ కమిటీ కన్వీనర్, బోర్డ్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వెంకటరమణనాయక్ 4, కమిటీ సభ్యులు 5, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు 10, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు 12, కస్టోడియన్లు 13 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.

15 వరకు 'ఈ–క్రాప్' సోషల్ ఆడిట్

అనంతపురం అగ్రికల్చర్: రబీ ఈ–క్రాప్, ఈ–కేవైసీకి సంబంధించి ఈనెల 15 వరకు ఆర్ఎస్‌కేల్లో సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) ఉంటుందని వ్యవసాయశాఖ జేడీ ఉమా మహేశ్వరమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ–క్రాప్ ప్రక్రియ ఆదివారంతో పూర్తయిందన్నారు. దీనిపై ఫిర్యాదులు, అభ్యంతరాలు, సర్దుబాట్ల కోసం ఆర్ఎస్‌కేల్లో జాబితాలు ప్రదర్శించి, సోషల్ ఆడిట్ నిర్వహిస్తారని తెలిపారు. రబీలో 83,451 హెక్టార్లు ఈ–క్రాప్‌లో నమోదైందన్నారు. 54,554 మందికి గానూ 51,716 మంది ఈ–కేవైసీ చేయించుకున్నట్లు పేర్కొన్నారు.

సెలవులో జేసీ

అనంతపురం అర్బన్: జాయింట్ కలెక్టర్(జేసీ) శివ్ నారాయణ్ శర్మ వ్యక్తిగత పనులపై ఐదు రోజుల పాటు సెలవులో వెళ్లారు. ఆయన తిరిగి ఈనెల 16వ తేదీన విధులకు హాజరవుతారు. అప్పటి వరకు డీఆర్ఓ ఎ.మలోల ఇన్‌చార్జ్ జేసీగా వ్యవహరిస్తారు.

'కేంద్రియ'లో ప్రవేశాలకు దరఖాస్తులు



అనంతపురంలోని కేంద్రియ విద్యాలయం

అనంతపురం/గుత్తి: కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేంద్రియ విద్యాలయాల్లో ప్రవేశాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది. ఒకటో తరగతిలో ప్రవేశానికి మార్చి 21వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. విద్యార్థి వయసు ఈ నెల 31 నాటికి ఆరేళ్లు పూర్తి కావాలి. ఎనిమిదేళ్లకు మించరాదు. దరఖాస్తు చేసుకున్నప్పుడే మూడు కేంద్రియ విద్యాలయాలను ప్రాధాన్యతా ప్రకారం ఎంపిక చేసుకోవాలి. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం సీట్లను ముందుగా భర్తీ చేస్తారు. ఇందు కోసం వచ్చిన అన్ని దరఖాస్తులను కలిపి డ్రా తీస్తారు. ఈ విధానంలో ఎంపికైన వారికి పూర్తి ఫీజు మినహాయింపు ఉంటుంది. 15 శాతం ఎస్సీ కేటగిరి వారికి, 7.5 శాతం ఎస్టీలకు, 27 శాతం సీట్లు ఓబీసీ నాన్ క్రిమిలేయర్‌తో నింపుతారు. దివ్యాంగులకు మూడు శాతం సీట్లు ఉంటాయి.

- రెండు, ఆపైన తరగతుల్లోని ఖాళీ సీట్లలో ప్రవేశానికి సంబంధిత విద్యాలయాల్లో ఏప్రిల్ 2 నుంచి 11వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఒకటో తరగతి ప్రవేశాల ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే జరగనుండగా, రెండు నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉన్న ఖాళీలకు ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, కమిటీ సభ్యుల సమక్షంలో లాటరీ ద్వారా ఎంపిక చేస్తారు. తొమ్మిదో తరగతిలో చేరడానికి పరీక్ష ఉంటుంది.

ఉద్యోగమా.. నువ్వెక్కడ?

అనంతపురం నగరంలోని ఓ హోటల్‌లో రెండు రోజుల క్రితం ఓ ప్రముఖ జ్యువెలరీ సంస్థ సేల్స్‌మెన్ ఉద్యోగాలకు నిర్వహించిన వాక్ఇన్ ఇంటర్వ్యూలకు పోటెత్తిన నిరుద్యోగులు వీరు. ఇంజినీరింగ్ మొదలు ఎంబీఏ పట్టభద్రుల వరకు వందల మంది హాజరయ్యారు. దీంతో హోటల్ ప్రాంగణం కిక్కిరిసి పోయింది. చిన్న సేల్స్‌మెన్ ఉద్యోగం కోసం వచ్చిన వీరిని చూస్తే జిల్లాలో నిరుద్యోగ సమస్య ఎంతలా ఉందో అంచనా వేయొచ్చని పలువురు అభిప్రాయపడ్డారు.



పతాక స్థాయికి నిరుద్యోగం

- గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్లు ఉన్నా ఫలితం శూన్యం
- ఎంఎస్ఎంఈలు ఏర్పాటు కాక చిన్న ఉద్యోగాలకూ దిక్కులేని వైనం
- 20 లక్షల ఉద్యోగాలిస్తామని ముఖం చాటేసిన చంద్రబాబు
- భృతి ఇస్తామని చెప్పి రిక్తహస్తం చూపడంపై నిరుద్యోగుల మండిపాటు



- గార్లదిన్నెకు చెందిన రాజశేఖర్ ఇటీవల బీఎస్సీ పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసినా రాలేదు. దీంతో ఆస్పత్రిలో ఔట్‌సోర్సింగ్ విధానంలో సెక్యూరిటీ గార్డుగా చేరాడు. మరో ఉద్యోగంలో చేరదామని ఎంత ప్రయత్నిస్తున్నా ఫలితం లేకపోతోందని రాజశేఖర్ ఆవేదన వ్యక్తం చేశాడు.
- రాప్తాడుకు చెందిన శీనయ్య అనంతపురంలో బీకాం పూర్తి చేశాడు. తన అర్హతకు తగిన జాబు కోసం కొన్ని నెలలుగా ప్రయత్నించినా ఎక్కడా దొరకలేదు. దీంతో ఇటీవల ఓ పెట్రోలు బంకు యజమాని వద్ద నిర్వహణ మేనేజర్‌గా చేరాడు. రేయింబవళ్లు పనిచేస్తే రూ.12 వేలు వేతనం. వీరే కాదు.. ఉమ్మడి జిల్లాలో ఎంతో మంది నిరుద్యోగులది ఇదే పరిస్థితి.

సాక్షి ప్రతినిధి, అనంతపురం: అలవిగాని హామీలు ఇవ్వడం.. ఆ తర్వాత మాట తప్పడం చంద్రబాబుకు అలవాటుగా మారింది. 'అధికారంలోకి వస్తే 20 లక్షల మందికి ఉద్యోగాలిస్తాం, ఉద్యోగాలు ఇవ్వలేకపోతే ప్రతినెలా నిరుద్యోగ భృతి ఇస్తాం..' అంటూ ఎన్నికల ముందు ఊదరగొట్టిన ఆయన.. సీఎం అయ్యాక మొహం చాటేశారు. కూటమి సర్కారు కొలువుదీరినప్పటి నుంచి ఒక్క ఉద్యోగం ఇచ్చివుంటే ఒట్టు. ఏ నిరుద్యోగికీ గడిచిన 9 నెలల్లో పది రూపాయలు నిరుద్యోగ భృతి కింద అందలేదు. దీంతో వారి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది.

ఎంఎస్ఎంఈల జాడేదీ..?

కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉమ్మడి జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ఏర్పాటు ఊసే లేదు. గత ప్రభుత్వ హయాంలో రమారమి 22 వేల పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. 55 వేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి లభించింది. కానీ ఇప్పుడు చిన్న పరిశ్రమల జాడే కానరావడం లేదు. పరిశ్రమలు పెడతామంటూ ఎవరైనా ముందుకొచ్చినా టీడీపీ నేతలు మామూళ్ల కోసం బెదిరిస్తుండటంతో వెనక్కు జంకుతున్న దుస్థితి నెలకొంది.

వలసలే శరణ్యం..

అసలే ఉమ్మడి అనంతపురం జిల్లా కరువు ప్రాంతం. అయితే, గత ప్రభుత్వ హయాంలో పుష్కలంగా వర్షాలు కురవడం, అన్ని వర్గాలకు ఆర్థిక చేయూతనివ్వడంతో ప్రజలకు బాధలు తప్పాయి. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. ఇప్పటికే గుంతకల్లు, ఉరవకొండ నియోజక వర్గాల నుంచి కర్ణాటక ప్రాంతానికి భారీగా వలసలు వెళుతున్నారు.

సాఫ్ట్‌వేర్ కలలు కల్లలు..

ఈ ఏడాది అంతర్జాతీయ విపణి బాగా లేదన్న కారణంగా సాఫ్ట్‌వేర్ సంస్థలూ నియామకాలు చేపట్టలేదు.దీంతో ఉమ్మడి జిల్లాలో ఇంజినీరింగ్ పూర్తి చేసి బయటకు వచ్చిన 90 శాతం మందికి పైగా ఇంటివద్దే ఉన్నారు. ఉద్యోగం లేక యాతన పడుతున్నారు.చేసేది లేక కొంతమంది పెట్రోలు బంకుల్లో చాలీచాలని జీతాలకు ఉద్యోగాల్లో చేరుతున్న పరిస్థితి కనిపిస్తోంది.



ఉమ్మడి అనంతపురం జిల్లాలో నిరుద్యోగులు

పీజీ, ఎంటెక్ చేసిన వారు	1,06,000
డిగ్రీ, బీటెక్ చేసిన వారు	2,40,000
టీటీసీ చేసిన వారు	35,800
ఐటీఐ, డిప్లొమా చేసిన వారు	78,000
ఇతరత్రా విద్యార్హతల వారు	2,70,000
మొత్తం నిరుద్యోగులు	7,29,800

బాబు తొలి సంతకంపైనే స్పష్టత లేదు



బీఎడ్ పూర్తి చేశా. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే డీఎస్సీ నోటిఫికేషన్‌పై ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేశారు. కానీ, తొమ్మిది నెలలు కావస్తున్నా దీనిపై స్పష్టత లేకుండా పోయింది. నిరుద్యోగులను నట్టేట ముంచేలా ప్రభుత్వం వ్యవహరిస్తోంది. నిరుద్యోగ భృతి మాటేమో కానీ ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు.

– మహాలింగ, కైరేవు, శెట్టూరు మండలం

నిరుద్యోగ భృతి ప్రకటించాలి



కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు అందిస్తామన్న భృతిపై ఒక్క మాట కూడా మాట్లాడటం లేదు. భృతి ఇస్తే ఎంతో తోడ్పాటు అందించినట్లు అవుతుంది. ప్రభుత్వ చేయూత లేక నిరుద్యోగులు గ్రామాల్లోనే చిన్నచిన్న పనులు చేసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇప్పటికైనా నోటిఫికేషన్లు విడుదల చేసి ఉద్యోగాలు భర్తీ చేయాలి.

–రామాంజనేయులు, గార్లదిన్నె


న్యాయం చేయాలి



నేను డిగ్రీ చదివా. ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నా. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో 20 లక్షల ఉద్యోగాలిస్తామని చెప్పింది. లేకుంటే రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. చంద్రబాబు మాటలు నమ్మి టీడీపీకి ఓటేశా. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతిపై ప్రకటన లేకుండా పోయింది. కనీసం బడ్జెట్‌లో కూడా పైసా కేటాయించలేదు. నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలి.

– అశోక్‌కుమార్, కణేకల్లు

కమనీయం.. ఖాద్రీశుని కల్యాణం



మంగళ సూత్రాలను భక్తులకు చూపుతున్న అర్చకులు



శ్రీవారి కల్యాణోత్సవానికి హాజరైన భక్తజనం

కదిరి: ప్రహ్లాద వరదుడు, వసంత వల్లభుడు, కాటమరాయుడిగా పూజలందుకుంటున్న ఖాద్రీ లక్ష్మీ నారసింహుని కల్యాణం కమనీయంగా సాగింది. భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. నవ వధువులుగా అలంకృతులైన శ్రీదేవి, భూదేవితో పాటు వరుడు నారసింహుడు సోమవారం రాత్రి 9.30 గంటలకు యాగశాల నుంచి పల్లకీపై కల్యాణ మండపం చేరుకున్నారు. అప్పటికే అక్కడ కిక్కిరిసిన భక్తజనం నోట శ్రీవారి గోవింద నామస్మరణ మార్మోగిపోయింది. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి విచ్చేసిన అర్చక పండితులు శ్రీవారి కల్యాణోత్సవ విశిష్టతను భక్తులకు వివరించారు. ముక్కోటి దేవతలు వీక్షించే స్వామివారి వివాహాన్ని సాక్షాత్తు బ్రహ్మదేవుడే ముందుండి జరిపిస్తున్నారని అర్చక పండితులు తెలియజేశారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య శ్రీవారికి ప్రతిరూపంగా విచ్చేసే కంకణ భట్టాచార్యులు మంగళ సూత్రాలను శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు అలంకరించారు. అనంతరం భక్తులందరికీ శ్రీవారి తలంబ్రాలు పంచిపెట్టారు.

ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు..

రాష్ట్ర ప్రభుత్వం తరఫున విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్వామివారికి పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకొచ్చారు. అంతకుముందు ఆయన ఆలయంలో స్వామివారిని దర్శించుకున్నారు. లోకేష్ రాకతో ఆలయ ప్రాంగణం టీడీపీ శ్రేణులతో నిండిపోయింది. దీంతో సామాన్య భక్తులు శ్రీవారి కల్యాణోత్సవాన్ని కనులారా వీక్షించలేకపోయారు.

ధ్వజారోహణంతో దేవతలకు ఆహ్వానం

నృసింహుని బ్రహ్మోత్సవాలను నలుదిక్కులా చాటేందుకు సోమవారం ఉదయం ప్రధాన ఆలయం ముందున్న ధ్వజ స్తంభానికి అర్చక పండితులు గరుడ దండాన్ని ధ్వజారోహణం చేశారు. సకల దేవతలకు ఇదే శ్రీవారి బ్రహ్మోత్సవ ఆహ్వాన పత్రిక..అని ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు పేర్కొన్నారు. పాల్గుణ కృష్ణ అష్టమి నాడు అంటే ఈ నెల 22న జరగనున్న తీర్థవాది ఉత్సవం రోజున శ్రీవారి చక్రస్నానం అనంతరం ఈ గరుడ దండాన్ని అవరోహణం చేస్తారు. దీంతో ఖాద్రీశుని బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

ప్రభుత్వానికి సత్తా చూపుదాం

- యువతకు అండగా నిలుద్దాం
- ఫీజు బకాయిలు విడుదల చేసే వరకూ బాబును వదిలేది లేదు
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



'యువత పోరు' పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత, పార్టీ నేతలు

అనంతపురం కార్పొరేషన్: యువతతో పాటు అన్ని వర్గాలనూ దగా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ఈ నెల 12న జరిగే 'యువత పోరు' కార్యక్రమం ద్వారా మన సత్తా ఏంటో చూపుదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు.సోమవారం నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో 'యువత పోరు' పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 'అనంత' మాట్లాడుతూ ఈ నెల 12న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవమన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో తమ పార్టీ చరిత్ర సృష్టించిందన్నారు. ఆ రోజున విద్యార్థులు, యువతకు అండగా నిలిచేందుకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. అనంతపురం జెడ్పీ కార్యాలయం నుంచి ప్రారంభమై సప్తగిరి సర్కిల్, సూర్య నగర్ సర్కిల్, సంగమేష్ సర్కిల్ మీదుగా కలెక్టరేట్‌కు ర్యాలీ చేరుకుంటుందన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందించి ప్రభుత్వానికి హెచ్చరిక చేయబోతున్నామన్నారు.జిల్లాలోని ప్రతి నియోజక వర్గం నుంచి భారీ సంఖ్యలో పార్టీ శ్రేణులు, యువత, విద్యార్థులు, తల్లిదండ్రులు తరలి రావాలని ఆయన పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలవుతున్నా ఒక్క హామీ నెరవేర్చలేదని దుయ్యబట్టారు. ఇటీవల బడ్జెట్‌లోనూ సరైన కేటాయింపులు చేయలేదన్నారు. పేద విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ఫీజు రీయింబర్స్‌మెంట్ ప్రవేశపెట్టారని, దీంతో ఎంతో మంది వైద్యులు, ఇంజినీర్లుగా ఎదిగారని గుర్తు చేశారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో 'వసతి దీవెన' పథకం కింద హాస్టల్ ఖర్చులు అందజేశారని తెలిపారు.

రూ.4,500 కోట్ల బకాయిలు..

ఫీజు బకాయిలు విడుదల చేసే వరకూ సీఎం చంద్రబాబును వదిలేది లేదని 'అనంత' స్పష్టం చేశారు. ఎన్నికల ముందు అన్ని విధాల ఆదుకుంటామని చెప్పి మోసం చేశారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం కింద రూ.4,500 కోట్ల బకాయిలున్నాయని, వాటిని తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి రూ.3 వేలు, 20 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. ఈ విషయాలపై కనీసం బడ్జెట్‌లో కూడా ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. వైఎస్ జగన్ పాలనలో రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలకు శ్రీకారం చుడితే... కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేట్ పరం చేయడానికి సిద్ధమైందన్నారు. అందరూ సంఘటితమై ఈ ప్రభుత్వ మెడలు వంచుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్ రెడ్డి, అహుడా మాజీ చైర్మన్ మహాలక్ష్మి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నేతలు రమేష్ గౌడ్, కొండ్రెడ్డి ప్రకాష్‌రెడ్డి, ఆలమూరు శ్రీనివాస్ రెడ్డి, సాకే చంద్రశేఖర్, చంద్రశేఖర్ యాదవ్, చింతకుంట మధు, చింతా సోమశేఖర్ రెడ్డి, కృష్ణవేణి, ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, గౌని నాగన్న, మల్లె మీద నరసింహులు, సైపుల్లాబేగ్, అమర్‌నాథ్‌రెడ్డి, కేశవరెడ్డి, మిక్చర్ రామకృష్ణా రెడ్డి, లబ్బే రాఘవ, దత్తా, అనిల్‌కుమార్ గౌడ్, రాధాకృష్ణ, కై లాష్, శ్రీదేవి, శోభారాణి, దేవి, శోభాబాయి, పార్వతి, భారతి, కార్పొరేటర్లు ఇసాక్, సాకే చంద్రలేఖ, లావణ్య, సుమతి, ఉష తదితరులు పాల్గొన్నారు.

అర్జీలిస్తూనే ఉన్నా స్పందన లేదు

- బాధితుల ఆవేదన
- 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు 419 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని బాధితులు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్ వినోద్ కుమార్‌తో పాటు డీఆర్ఓ ఎ.మలోల, డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, రామ్మోహన్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి 419 వినతులు అందాయి.

వినతుల్లో కొన్ని...

- 'పీఎం' కిసాన్ డబ్బు అందడం లేదని ఆత్మకూరు మండలం తలపూరుకు చెందిన పి.ఎర్రిస్వామి విన్నవించాడు. 2.30 ఎకరాల్లో చీనీ పంట ఉందని, 'పీఎం కిసాన్' కింద డబ్బులు అందించాలని కోరాడు.
- వితంతు పింఛను ఇప్పించాలంటూ శింగనమల మండలం గోవిందరాయునిపేట గ్రామానికి చెందిన మంజుల అంజనమ్మ విన్నవించింది. తన భర్త వెంకటేష్ గత ఏడాది జనవరి 8న మరణించాడని, అప్పట్లో ఆయనకు వృద్ధాప్య పింఛను వచ్చేదని చెప్పింది.
- తన తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని పుట్లూరు మండలం ఎస్.తిమ్మాపురం గ్రామానికి చెందిన జి.రవినాథ్‌రెడ్డి విన్నవించాడు. త్వరగా తగిన చర్యలు తీసుకోవాలని వేడుకున్నాడు.

పరిహారం తక్కువిచ్చారు



జాతీయ రహదారి 544–డీలో భాగంగా మాకున్న 4 సెంట్ల స్థలంతో పాటు ఇంటిని కోల్పోయాం. 15 ఏళ్ల వేపచెట్లు మూడు తొలగించారు. కేవలం రూ.2.30 లక్షల పరిహారం ఇచ్చారు. మా ఊరిలో చాలా మందికి రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు పరిహారం అందింది. అందరితో సమానంగా పరిహారం ఇచ్చి ఆదుకోవాలి. అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నా సమస్య పరిష్కారం కాలేదు.

– సుంకులమ్మ, సీపురం, శింగనమల మండలం

ఒక్క రూపాయి ఇవ్వలేదు



సజ్జలదిన్నె పొలం సర్వే నంబరు 338–1–64, 339–2–74లో మాకు 6 ఎకరాలు ఉంది. జాతీయ రహదారి 544– డీ నిర్మాణం కోసం అందులో 23 సెంట్లు తీసుకున్నారు. ఆరు ఎకరాల్లో వేసిన కంది పంటనూ తొలగించారు. రూ.5.75 లక్షల పరిహారం రావాల్సి ఉంటే ఒక్క రూపాయి ఇవ్వలేదు. తహసీల్దారు కార్యాలయం, కలెక్టరేట్‌లో చాలా సార్లు అర్జీ ఇచ్చాను. సమస్య పరిష్కారం కాలేదు.

– ఇంజా లక్ష్మిరెడ్డి, వెంకటరెడ్డిపల్లి, తాడిపత్రి మండలం

సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలి

సాక్షికి స్పందన — SAKSHI EFFECT

అనంతపురం అర్బన్: చిన్నపాటి సమస్యలు జిల్లా కేంద్ర కార్యాలయాలకు రాకుండా క్షేత్రస్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన ''తిప్పుకుని... తప్పుకుంటున్నారు'' కథనానికి కలెక్టర్ స్పందించారు. సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ వారం నుంచి తహసీల్దారు కార్యాలయాల తనిఖీ చేపడతామన్నారు. జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు వారానికి ఒక తహసీల్దారు కార్యాలయాన్ని తనిఖీ చేయాలని ఆదేశించారు. దీనికి సంబంధించి ఇన్‌స్పెక్షన్ ప్రొఫార్మా సంబంధిత కార్యాలయాలకు పంపిస్తామన్నారు. తనిఖీకి వచ్చినప్పుడు 'వన్ సర్వే నంబర్– వన్‌ఫైల్' విధానం అమలును పరిశీలిస్తామన్నారు. చుక్కల భూమికి సంబంధించి ప్రజాసేవ పోర్టల్‌లో పెండింగ్ ఉన్నవాటిని పరిష్కరించాలన్నారు. మండలస్థాయిలో ప్రజాసేవలు వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఉద్యోగులకు సన్మానం

పెన్షన్ పంపిణీ ఒకటో తేదీ మొదటి గంటలో 100 శాతం పూర్తి చేసిన వారిని కలెక్టర్ సన్మానించారు. 'బెస్ట్ పెర్ఫార్మెన్స్' సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ దాతల భాగస్వామ్యం (పీ4) పోస్టర్లను ఆవిష్కరించారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి

ఉపాధి హామీ పథకం, ఇతర కార్యక్రమాల కింద కేటాయించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయం నుంచి డ్వామా పీడీ, డీఎల్‌డీఓలు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, ఏపీడీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

క్లుప్తంగా

శేషవాహనంపై చెన్నకేశవుడు



పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రమైన యాడికిలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం దేవేరులతో కలసి శేషవాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో విశేష పూజలు పెద్ద ఎత్తున జరిగాయి. రాత్రి 10 గంటలకు శేష వాహన సేవలను నేత్రపర్వంగా నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

12న జాబ్ మేళా

గుంతకల్లు రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో గుంతకల్లులోని న్యాక్ ట్రెనింగ్ సెంటర్‌లో ఈ నెల 12న జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ మేరకు న్యాక్ ఏడీ గోవిందరాజులు, డీఎస్‌డీఓ ప్రతాప్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసి, 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్న నిరుద్యోగ యువతీ యువకులు అర్హులు. టాటా క్యాపిటల్, సింధూజ మైక్రో క్రెడిట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ప్రతినిధులు హాజరై ఆయా కంపెనీల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను ఎంపిక చేయనున్నారు. ఆసక్తి ఉన్న వారు ధ్రువీకరణ పత్రాలతో జాబ్‌మేళాకు హాజరు కావచ్చు.

యువకుడి దుర్మరణం



కార్తీక్ (ఫైల్)

ఉరవకొండ: స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయం ఎదురుగా ఉన్న రోడ్డు డివైడర్‌ను ఢీకొని ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఉరవకొండలోని ఇంద్రా నగర్‌కు చెందిన కార్తీక్ (18), నందకుమార్ సోమవారం ఉదయం ద్విచక్ర వాహనంపై వెళుతూ వేగాన్ని నియంత్రించుకోలేక డివైడర్‌ను ఢీకొన్నారు. ఘటనలో కార్తీక్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన నందకుమార్‌ను స్థానికులు వెంటనే ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై సీఐ మహానంది కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



గుంతకల్లు: స్థానిక తిమ్మనచర్ల రైలు మార్గంలో 440/29 కి.మీ. వద్ద పట్టాలపై ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్‌పీ ఎస్‌ఐ మహేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. దాదాపు 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఆచూకీ తెలిసిన వారు 98661 44616కు ఫోన్ చేసి సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

టమాట రైతు చిత్తు

- నాలుగు నెలలుగా గిట్టుబాటు ధర లేక భారీగా నష్టాలు
- కిలో రూ.8 చొప్పున కొంటామని చెప్పిన కూటమి ప్రభుత్వం
- కేవలం 60 టన్నులతో చేతులెత్తేసిన మార్కెటింగ్ శాఖ
- రాష్ట్రంలోనే అత్యధికంగా 45 వేల ఎకరాల్లో టమాట పంట



కక్కలపల్లి టమాట మండీకి వచ్చిన సరుకు



నాణ్యమైన టమాటకు 'నో సేల్' అంటూ పేపర్‌పై ఇంటూ మార్క్ వేసిన దృశ్యం (ఫైల్).

అనంతపురం అగ్రికల్చర్: టమాటను నమ్ముకున్న రైతులు ఈ సారి కూడా భారీగా నష్టాలు మూటకట్టుకున్నారు. జిల్లాలో ఏకంగా ఖరీఫ్, రబీలో ఈ ఏడాది 45 వేల ఎకరాల భారీ విస్తీర్ణంలో టమాట సాగులోకి వచ్చింది. ఈ సారి 8 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా దిగుబడిని రైతులు సాధించారు. టన్ను సరాసరి కనిష్టంగా రూ.15 వేలు ప్రకారం అమ్ముడుబోయినా ఈ సారి రూ.1,200 కోట్ల మేర టర్నోవర్ ఉండేదని అంచనా. కానీ మార్కెట్ హెచ్చుతగ్గుల కారణంగా 80 శాతం మంది రైతులు భారీగా నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల పరిధిలో అనంతపురం జిల్లాలో 45 వేల ఎకరాల టమాట సాగులో మొదటి స్థానంలో ఉండగా... 22 వేల ఎకరాలతో శ్రీసత్యసాయి జిల్లా రెండో స్థానంలో ఉండటం విశేషం. ఆ తర్వాత అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, వైఎస్సార్ జిల్లాలు ఉన్నాయి.

నాలుగు నెలలుగా పతనావస్థలో..

సీజన్ ఆరంభమైన జూలై నుంచి అనంతపురం సమీపంలో ఉన్న కక్కలపల్లి మండీలో టమాట అమ్మకాలు మొదలయ్యాయి. మొదట్లో పరిస్థితి ఆశాజనకంగా ఉండటంతో రైతులు టమాట సాగుపై ఎక్కువగా దృష్టి పెట్టారు. ఫలితంగా సెప్టెంబర్ నుంచి పంట దిగుబడులు, మార్కెట్‌కు సరుకు రావడం పెరిగింది. ధర కొంచెం బాగున్నప్పుడు మధ్య మధ్యలో వర్షాలు రావడంతో పంట తడిసిందని, మచ్చ ఉందంటూ మండీ నిర్వాహకులు, వ్యాపారులు 'నో సేల్' పెట్టడంతో చాలా మంది రైతులకు అసలుకే మోసపోయారు. ఇలా డిసెంబర్ వరకు టమాట అమ్ముడుపోక కొందరు రైతులు తల్లడిల్లిపోయారు. ఇక డిసెంబర్ నుంచి మార్కెట్ పూర్తిగా పతనమైంది. గరిష్ట ధర రూ.10, కనిష్టం రూ.5, సరాసరి రూ.7 చొప్పున గత మూడు నెలలుగా మార్కెట్‌లో ధరలు కొనసాగుతుండటంతో టమాట రైతులు పూర్తిగా చిత్తయ్యారు. నాలుగైదు లాట్ల గరిష్ట ధర రూ.10 ప్రకారం అమ్ముడుబోగా మిగతాదంతా రూ.5 నుంచి రూ.7 కి మించి ధర పలకలేదు. దీంతో చాలా మంది రైతులు.. కూలీలు, రవాణా ఖర్చులు కూడా రాదని గ్రహించి పంటను పొలాల్లోనే వదిలేశారు.

'కూటమి' మోసం..

జిల్లాలోని 31 మండలాల్లో ఖరీఫ్‌లో 42 వేల ఎకరాలు, రబీలో 3 వేల ఎకరాల్లో టమాట సాగు చేసినట్లు ఉద్యానశాఖ నివేదికలు చెబుతున్నాయి. టమాట రైతులు ఇబ్బంది పడకుండా కిలో రూ.8 చొప్పున టన్ను రూ.8 వేలతో కొనుగోలు చేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. అయితే ఆచరణకు వచ్చేసరికి మార్కెటింగ్‌శాఖ ద్వారా ఇటీవల కేవలం 60 టన్నులు అంటే రూ.4.80 లక్షల విలువ చేసే టమాట మాత్రమే కొనుగోలు చేసి చేతులెత్తేసింది. అనంతపురం మండీకి ప్రస్తుతం కొంత తగ్గినా డిసెంబర్ నుంచి పరిగణనలోకి తీసుకుంటే రోజుకు సగటున 500 టన్నుల వరకు సరుకు వస్తోంది. కనీసం రోజుకు 100 టన్నులైనా కొనుగోలు చేస్తే కొంత వరకు రైతులకు వెసులుబాటు ఉంటుంది. కానీ సీజన్ అంతా కొన్నది కేవలం 60 టన్నులు మాత్రమే అంటే రైతుల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

పెట్టుబడి కూడా అందలేదు



"ఎకరాకు రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టి రెండున్నర ఎకరాల్లో టమాట సాగు చేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేక భారీగా నష్టపోయాను. ఇటీవల మండీలో 15 కిలోల బాక్సు రూ.70కు మించి పలకలేదు. అంటే కిలో రూ.5 చొప్పున కూడా కొనుగోలు చేయడం లేదు. మొదటి నాలుగైదు కోతల్లో నాణ్యమైన కాయ ఉన్నా కొనలేదు. పెట్టుబడి మాట దేవుడెరుగు కనీసం కూలీలు, రవాణా ఖర్చులు కూడా చేతికి అందలేదు. ఇలా అయితే రైతులు ఎలా బతకాలి."

– సుధాకర్, టమాట రైతు, దయ్యాలకుంటపల్లి, బీకేఎస్ మండలం

హోరాహోరీగా ఇరుసు ఎత్తు పోటీలు



ఇరుసు ఎత్తుతున్న గుంతకల్లు మండలం తిమ్మాపురం వీరేష్

పెద్దవడుగూరు(యాడికి): మండల కేంద్రమైన యాడికిలో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఇరుసు ఎత్తే పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి గ్రామీణ యువకులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి పోటీ పడ్డారు. గుంతకల్లు మండలం తిమ్మాపురం వీరేష్ ప్రథమ స్థానాన్ని దక్కించుకోగా, ద్వితీయ స్థానంలో పామిడి మండలం వంకరాజుకాలువకు చెందిన నరేష్, తృతీయ స్థానంలో నాగలాపురం గ్రామానికి చెందిన నరేంద్ర నిలిచారు. విజేతలను అభినందిస్తూ నిర్వాహకులు నగదు పురస్కారాలతో సత్కరించారు.

సమస్యలపై సత్వరమే స్పందించాలి : ఎస్పీ



పిటీషనర్లతో మాట్లాడుతున్న ఎస్పీ పి.జగదీష్

అనంతపురం: పిటీషనర్ల సమస్యలపై సత్వరమే స్పందించాలని సిబ్బందిని ఎస్పీ పి. జగదీష్ ఆదేశించారు. పోలీస్‌కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 61 వినతులు అందాయి. వినతులను ఎస్పీ స్వయంగా స్వీకరించారు. చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే పిటీషన్లను నిర్ణీత గడువు లోపు చట్ట పరిధిలో విచారించి పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ డీవీ రమణ మూర్తి, మహిళా పీఎస్ డీఎస్పీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

సీనియారిటీ జాబితా లోపభూయిష్టం : వైఎస్సార్‌టీఏ

అనంతపురం ఎడ్యుకేషన్: ప్రభుత్వం ప్రకటించిన ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో అనేక లోపాలున్నాయని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి. అశోక్ కుమార్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటరమణప్ప, రాష్ట్ర కార్యదర్శి ఏ. గోపాల్, రవీంద్రారెడ్డి గోవిందరెడి, రామకృష్ణ, కృష్ణా నాయక్, సిద్ధ ప్రసాద్, వెంకటరెడ్డి సోమవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా తయారీలో భాగంగా వివిధ సబ్జెక్టుల్లో ప్రమోషన్ పొందిన తేదీలను జాయినింగ్ తేదీలుగా నమోదు చేశారని, మరి కొందరు మరుసటి రోజు జాయినింగ్ డేట్‌గా నమోదు చేయడంతో జాబితా మొత్తం తప్పుల తడకగా మారిందన్నారు. అంతర్ రాష్ట్ర బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన ఉపాధ్యాయుల సీనియారిటీని కాకుండా వారు కేడర్‌లో చేరిన తేదీని సీనియారిటీ జాబితాలో చూపించారన్నారు. ఫలితంగా జూనియర్లయినా వారు జాబితాలో మాత్రం సీనియర్లుగా కనిపిస్తున్నారన్నారు. అలాగే ఒక మేనేజ్‌మెంట్ నుంచి మరొక మేనేజ్‌మెంట్‌కు మారిన వారిని క్షుణ్ణంగా పరిశీలించి జాబితా సరి చేయాలని కోరారు.

రైతులంటే అంత చులకనా?

- తొమ్మిది నెలలవుతున్నా పత్తాలేని పెట్టుబడి సాయం
- ప్రహసనంలా మారిన 'అన్నదాత సుఖీభవ'
- పంటలకు గిట్టుబాటు ధర లేదు
- కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట రైతుల ధర్నా



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన రైతు సంఘం నాయకులు, రైతులు

అనంతపురం అర్బన్: రైతులంటే సీఎం చంద్రబాబుకు చులకనై పోయారని, రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘం నాయకులు ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా కనీసంగా కూడా రైతులకు చేసిన మేలు ఏమీ లేదని దుమ్మెత్తిపోశారు. మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని, 2024–25 ఖరీఫ్, రబీలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం ప్రకటించి రైతులను ఆదుకోవాలంటూ సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతు సంఘం నాయకులు, రైతులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తరిమెల నాగరాజు, ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. రైతు సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యంగా చెప్పుకుంటున్న ప్రజాప్రతినిధులు ఈ తొమ్మిది నెలల కాలంలో రైతులకు చేసిన మేలు ఏమిటో ఒక్కటైనా చెప్పాలని ప్రశ్నించారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు పెట్టుబడి సాయం ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. 2024–25 ఖరీఫ్, రబీలో అతివృష్టి, అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతింటే ఈ రోజుకూ రైతులకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. మిరప, పత్తి, పప్పుశనగ, సీడ్ జొన్న పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఆ పంటలకు గిట్టుబాటు ధర కల్పించి కొనుగోలు చేయాలనే ఆలోచన కూడా ప్రభుత్వం చేయకపోవడం దుర్మార్గమన్నారు. ఇదేనా రైతు సంక్షేమం అంటూ నిలదీశారు. ఇప్పటికైనా రైతులను ఆదుకోకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు సాగిస్తామని హెచ్చరిస్తూ కలెక్టర్ వినోద్‌కుమార్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు రామిరెడ్డి, ఆర్‌వీనాయుడు, ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా నాయకులు శివారెడ్డి, విరుపాక్షి, మధుసూదన్ నాయుడు, రాజారాంరెడ్డి, బీహెచ్ రాయుడు, దస్తగిరి, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి కాటికోటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

బత్తలపల్లి: సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వరుని ఆలయంలో ఈ నెల 12 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఐదు రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాల వివరాలను ఆలయ ధర్మకర్తలు సుధాకర్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. బ్రహ్మోత్సవాల్లో తొలిరోజు బుధవారం రెడ్డివారి బోనాలు నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని రెడ్లు అందరూ సమావేశమై క్షేత్రానికి చేరుకుని స్వామికి తొలిపూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ప్రతి ఏటా వేద పండితులు తొలిపూజలు చేస్తే మిగిలిన రోజుల్లో తలార్లు (బోయ) పూజలు చేస్తారన్నారు. మొదటి రోజు (బుధవారం) బ్రాహ్మణ సంప్రోక్షణ, శిలావరఫోటు ఉపశమన పూజ, ధ్వజారోహణం, ఊరేగింపులు ఉంటాయని తెలిపారు. 13న కాటమయ్యస్వామి ఉత్సవ ప్రభకు అశ్వ, గజ, నంది వాహనాలను పూన్చుట, సాయంత్రం 4 గంటలకు నిమ్మచెట్ల బావి మోటున గంగపూజ, రాత్రి 10 గంటలకు ముష్టూరు నుంచి స్వామి కొండకు బయలుదేరే కార్యక్రమం ఉంటుందన్నారు. 14న రాత్రి 10 గంటలకు తేరువీధుల్లో స్వామి ఊరేగింపు, 11.30 గంటలకు లంకాదహనం (కాముని దహనం) నిర్వహించనున్నట్లు వెల్లడించారు. 15న పన్నెరు బండ్ల ప్రదక్షిణలు, పగలు తేరు, సాయంత్రం స్వామి ముష్టూరు గ్రామానికి చేరుకునే కార్యక్రమం ఉటుందని తెలిపారు. 16న ముష్టూరు జీవగడ్డలో స్వామికి మారు పూజలు నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్త సుధాకరరెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

పల్లె అక్రమాలపై ఈడీ విచారణ చేయించాలి

- కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసిన ఎంపీపీ ఆదినారాయణయాదవ్

సాక్షి, పుట్టపర్తి/పుట్టపర్తి టౌన్: టీడీపీ నేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి అక్రమ వ్యాపారాలు, మనీ లాండరింగ్, విద్యాసంస్థల పేరుతో ఫీజుల దోపిడీ ద్వారా రూ.వేల కోట్లు సంపాదించారని, వీటన్నింటిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)తో విచారణ చేయించాలని ముదిగుబ్బ ఎంపీపీ, బీజేపీ నాయకుడు ఆదినారాయణ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన జిల్లా కేంద్రం పుట్టపర్తిలోని కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక పల్లె రఘునాథరెడ్డితో పాటు బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి, ఇంకొందరు కలసి తనను అంతమొందించేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వారం క్రితం సంకేపల్లి వద్ద వాహనంపై రాళ్లతో దాడి చేశారని, ఇప్పుడు పుట్టపర్తికి వస్తుండగా దారి పొడవునా అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. కియా వద్ద ఉన్న తన భూమిని కాజేసే ప్రయత్నంలో భాగంగా పల్లె రఘునాథరెడ్డి తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. దొంగ పత్రాలు, నకిలీ అగ్రిమెంట్లతో బెదిరింపులకు దిగుతున్నారన్నారు. ఈ భూ వివాదాలతో మంత్రి సత్యకుమార్‌కు సంబంధం లేకున్నా.. తరచూ వీటిలోకి లాగుతున్నారన్నారు.

నాడు హామీలు... నేడు అరెస్టులా?

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర ధ్వజం



నగరంలోని టవర్ క్లాక్ వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అనంతపురం అర్బన్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చనందుకు కూటమి నేతలు సిగ్గుపడాల్సిందిపోయి... వాటి గురించి ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం సిగ్గుచేటని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మండిపడ్డారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు అవుతున్నా.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. అంగన్‌వాడీల అరెస్టులను నిరసిస్తూ నాయకులు, అంగన్‌వాడీలు సోమవారం స్థానిక టవర్‌క్లాక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం విజయవాడలో జరిగే శాంతియుత ధర్నాకు జిల్లా నుంచి బయలుదేరిన అంగన్‌వాడీలను వైఎస్సార్ జిల్లా ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్‌లో పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. అంగన్‌వాడీలకు వేతనం పెంచలేదన్నారు. చనిపోయాక మట్టి ఖర్చులు రూ.20 వేలు ఇస్తామని చెప్పి ఇప్పుడు రూ.15వేలు చెల్లించేలా జీఓ ఇచ్చారన్నారు. సుప్రీం కోర్టు చెప్పినట్లుగా అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయకుండా రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రకటించి చేతులు దులుపుకుంటే అంగీకరించే ప్రసక్తేలేదన్నారు. అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే తీవ్రస్థాయిలో పోరాటాలు సాగించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రామాంజినేయులు, ముత్యాజా, వెంకటనారాయణ, నాగరాజు, ఎర్రిస్వామి, తిరుమలేషు, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సంఘం నాయకురాళ్లు అరుణమ్మ, నక్షత్ర, రేవతి, పార్వతి, పద్మ, జ్యోతి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

వైభవంగా లంకా దహనం

ఉరవకొండ: గవిమఠం చంద్రమౌళీశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా లంకాదహనం వైభవంగా జరిగింది. గవిమఠం ఉత్తరాధికారి డాక్టర్ కరిబసవరాజేంద్ర స్వామి, మఠం సహాయ కమిషనర్ కె.రాణి ఆధ్వర్యంలో కార్యక్రమంల నిర్వహించారు. అనంతరం అశ్వవాహనంపై చంద్రమౌళీశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా కురుబ సేవా సంఘం ఆధ్వర్యంలో గొరవయ్యల పాలు తాపించే కార్యక్రమం సంప్రదాయబద్ధంగా జరిగింది.



అశ్వవాహనంపై దర్శనమిస్తున్న చంద్రమౌళీశ్వరస్వామి



లంకాదహనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గుడి.. గుడి స్థలం కూడా నాదే!

- అక్కమాంబ ఆలయ ఆదాయ వనరుల దోపిడీ
- జాతరలో దుకాణాల ఏర్పాట్లపై ముందస్తుగానే వసూళ్లు
- ఇదేమని ప్రశ్నిస్తే దేవుడికన్నా తామే గొప్ప అంటూ టీడీపీ నేత బరితెగింపు



ఆలయ ప్రాంగణంలో తిష్ట వేసి దుకాణాల యజమానులతో డబ్బు వసూలు చేస్తున్న టీడీపీ నేత డిష్ మురళి

కళ్యాణదుర్గం రూరల్: 'ఆలయం మా సొంతం. మాకన్నా దేవుడు గొప్ప కాదు. జాతరలో దుకాణం ఏర్పాటు చేయాలనుకునే వారు ఎవరైనా మా మాట వినాల్సిందే. మాకే డబ్బు చెల్లించాల్సిందే' అంటూ కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ప్రధాన అనుచరుడు, టీడీపీ నేత డిష్ మురళి దౌర్జన్యాలకు తెరలేపాడు. వివరాలు... కళ్యాణదుర్గం పట్టణ సమీపంలో అత్యంత ప్రసిద్ధి చెందిన అక్కమాంబ దేవాలయం ఉంది. కొన్నేళ్లుగా ఈ ఆలయానికి ఒంటిమిద్ది, కురాకులతోట, దేవాదులకొండ గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో కమిటీ మెంబర్లను ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం దేవాదులకొండ గ్రామానికి చెందిన రాము అనే వ్యక్తి ఆలయ కమిటీ చైర్మన్‌గా ఉన్నారు. ఏటా ఉగాది పండుగ అయిన మరుసటి రెండు రోజుల పాటు ఇక్కడ జాతర జరుగుతుంది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాక పొరుగున ఉన్న కర్ణాటక ప్రాంతం నుంచి కూడా పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటుంటారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రాంగణంలో వందకు పైగా వివిధ రకాల దుకాణాలు ఏర్పాటవుతుంటాయి. ఇందుకు సంబంధించి ఆలయ కమిటీ సభ్యులు ఉగాదికి ముందుగానే టెండర్లు నిర్వహించి దుకాణాల నిర్వహణకు సంబంధించి అనుమతులు జారీ చేస్తారు. ఇలా వచ్చిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధి పనులకు ఉపయోగిస్తుంటారు.

టీడీపీ నేత బరితెగింపు

ఈ ఏడాది టీడీపీ నేత డిష్ మురళి బరితెగించి ఆలయ ఆదాయ వనరుల దోపిడీకి శ్రీకారం చుట్టాడు. ఇందులో భాగంగా సోమవారం ఆలయ ప్రాంగణంలో తిష్టవేసి ఉగాది తర్వాత దుకాణాలు నిర్వహించదలుచుకునే వారు తనకే డబ్బు చెల్లించాలని హుకుం జారీ చేశాడు. ఇదేమని పలువురు ప్రశ్నిస్తే 'దేవుడికి ఇస్తే ఏమొస్తుంది. ఆలయం సొమ్మంతా మాదే. రాష్ట్రంలో అధికారంలో ఉన్నాం కాబట్టి అందరూ మా మాటే వినాలి. లేకపోతే ఏ ఒక్కరూ ఇక్కడ దుకాణం పెట్టుకోలేరు' అంటూ బెదిరింపులకు దిగాడు. అంతటితో ఆగకుండా 'గుడి మొత్తం నా స్థలంలోనే ఉంది. ఎక్కువగా మాట్లాడితే గుడి కూడా నాదే. ఎవ్వరేమీ చేసుకోలేరు' అంటూ దౌర్జన్యానికి తెరదీశాడు. దీంతో దుకాణాలు నిర్వహించేందుకు సిద్ధపడి వచ్చిన వారు మరోమాట మాట్లాడకుండా డబ్బు చెల్లించి పేర్లు నమోదు చేసుకున్నారు. ఒక్కో దుకాణానికి రూ.1,500 చొప్పున వందకు పైగా దుకాణాల నిర్వాహకులతో బలవంతంగా డబ్బు వసూలు చేయడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది.

క్లుప్తంగా

బకాయి వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మెడికల్ కాంట్రాక్టు కార్మికులు

అనంతపురం అర్బన్: పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతన బకాయిలను తక్షణం చెల్లించాలంటూ మెడికల్ కాంట్రాక్టు కార్మికులు డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగ, కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు చిరంజీవి, మనోహర్, వెంకటేష్ మాట్లాడారు. కాంట్రాక్టర్ నాలుగు నెలలుగా వేతనం ఇవ్వకపోవడంతో ఆర్థిక సమస్యలతో కుటుంబాలను పోషించుకోలేని దుస్థితిలో ఉన్నామన్నారు. సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు నల్లమ్మ, భార్గవి, లక్ష్మి, అంజలి, లక్ష్మీదేవి, శివ పాల్గొన్నారు.

డీలర్లు అవినీతికి పాల్పడితే ఉపేక్షించం



రాప్తాడులో రేషన్ షాపు దగ్గర విచారణ చేస్తున్న సీఎస్‌డీటీ జ్యోతి

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడు: రేషన్ లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందడం లేదని ఫిర్యాదు చేస్తే అక్కడికక్కడే సంబంధిత డీలర్‌ను సస్పెండ్ చేస్తామని తహసీల్దార్ విజయకుమారి, సీఎస్‌డీటీ జ్యోతి హెచ్చరించారు. ఈనెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో 'పేదల బియ్యం.. డీలర్ల భోజ్యం' శీర్షికతో కథనం వెలువడింది. జిల్లా అధికారులు, తహసీల్దార్ ఆదేశాల మేరకు స్పందించిన సీఎస్‌డీటీ జ్యోతి సోమవారం రాప్తాడులో ఉన్న మూడు రేషన్ షాపులను సందర్శించారు. ఆ రేషన్ షాపుల పరిధిలోని కార్డు దారులను విచారించి, రిపోర్టు తయారు చేశారు. ఎవరైనా డీలర్లు అవినీతికి పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే ఆ షాపును సీజ్ చేస్తామని పేర్కొన్నారు. డిపోల్లో తూకాల్లో మోసం చేస్తే ఎంతటి వారినైనా క్షమించే ప్రసక్తే ఉండదన్నారు.

నేడు ఎస్కేయూలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని పాలిమర్ సైన్సెస్ సెమినార్ హాలులో మంగళవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె. అనిత తెలిపారు. చైతన్య గ్రూప్ ఆధ్వర్యంలో ఈ ఇంటర్వ్యూలు కొనసాగుతాయన్నారు. అభ్యర్థులకు రాత పరీక్ష, డెమో లెక్చర్స్ నిర్వహించి ఎంపిక చేస్తారన్నారు. ఆసక్తి ఉన్న ఆర్ట్స్, సైన్స్ అభ్యర్థులు తమ రెజ్యూమ్‌తో పాటు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు వెంట తీసుకురావాలన్నారు. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎంపిక ప్రక్రియ ఉంటుందన్నారు.

'బాల్య స్మృతులు గుర్తుకొస్తాయి'



సత్యానంద్‌తో ఆచార్య సుధాకర బాబు, రామయ్య

అనంతపురం కల్చరల్: అనంతకు వచ్చినప్పుడు బాల్య స్మృతులు గుర్తుకొస్తాయని సీనియర్ తెలుగు చలనచిత్ర స్క్రిప్ట్ రచయిత సత్యానంద్ అన్నారు. సీనియర్ ఎన్టీఆర్‌తో జస్టిస్ చౌదరి, కొండవీటి సింహం, ఎదురీత వంటి హిట్ చిత్రాలకు కథ, మాటలు అందించిన ఆయన సోమవారం ఓ సినిమా స్క్రిప్ట్ రచన కోసం మరో అనంత రచయిత దీనరాజ్‌తో కలిసి అనంతకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ రోజుల్లో చిన్నగా ఉన్న ప్రాంతం నేడు ఆసాంతం మారిపోయిందన్నారు. చెరువుకట్ట ఉన్న గణేష్ దేవాలయం, పాతూరు అమ్మవారి శాల, శ్రీకంఠం కూడలి ప్రాంతాలను గుర్తు చేసుకుంటూ అప్పట్లో పెద్ద నటీనటులు అనంతకు వచ్చి.. ఇక్కడి వారితో ప్రత్యేక అనుబంధం ఏర్పరుచుకోవడం జరిగిందన్నారు. అనంతరం ఎస్కేయూ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య సుధాకరబాబు, ఘంటసాల ఆరాధన సమితి గౌరవాధ్యక్షుడు జీవీ రామయ్య, విశ్రాంత ఇంజినీర్ సుధాకరబాబు తదితరులు సత్యానంద్‌ను సత్కరించారు.

సావిత్రీబాయి పూలేకు నివాళి

అనంతపురం రూరల్: సావిత్రీబాయి పూలే ఆశయాలను కొనసాగిస్తామని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌బాబు అన్నారు. సోమవారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళల విద్య, హక్కుల సాధనకు ఎనలేని కృషి చేశారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు విష్ణువర్ధన్, కేశవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్ @ రూ.135.18 కోట్లు

- స్టాండింగ్ కమిటీలో నగరపాలక సంస్థ బడ్జెట్ ఆమోదం
- ఆదాయం రూ.115.24 కోట్లు
- విచారణ చేపట్టాకే బయో మైనింగ్ బిల్లులు చెల్లించాలి
- కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాల్సిందే
- అధికారులకు మేయర్ వసీం ఆదేశం



మాట్లాడుతున్న మేయర్ వసీం, చిత్రంలో కమిషనర్ బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ బడ్జెట్ రూ.135.18 కోట్లకు స్టాండింగ్ కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థలోని మేయర్ వసీం అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. స్టాండింగ్ కమిటీలో 2025–26కు సంబంధించిన బడ్జెట్, కొన్ని అభివృద్ధి పనులకు సభ్యులు ఆమోదం తెలిపారు. బయోమైనింగ్ చెత్త నిర్వహణ, కుక్కల బెడద, అభివృద్ధి పనుల జాప్యంపై మేయర్ వసీం అధికారులను ప్రశ్నించారు. సకాలంలో పనులు పూర్తి చేసేలా చూడాలి అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ 2024–25 సవరించిన బడ్జెట్ ప్రారంభ నిల్వ రూ.111.57 కోట్లు కాగా.. ఈ ఏడాది బడ్జెట్ రూ.135.18 కోట్లు కేటాయించారు. అందులో నగరపాలక సంస్థ ఆదాయం రూ.115 కోట్లుగా చూపించారు. మూలధనం జమలు రూ.27.31 కోట్లు, మిగులు రూ.33.72 కోట్లు చూపించారు. బడ్జెట్‌లో నీటి సరఫరాకు రూ.27.03 కోట్లు, మురుగు కాలువలకు రూ.17.57 కోట్లు, రోడ్ల ఏర్పాటుకు రూ.25.69 కోట్లు, లైట్ల నిర్వహణకు రూ.9.46 కోట్లు, పార్కుల అభివృద్ధి నిర్వహణకు 13.51 కోట్లు, మార్కెట్లు, చిన్న పార్కులు, కమ్యూనిటీ హాళ్లు, మరుగుదొడ్లు తదితర వాటికి రూ.22.98 కోట్లు బడ్జెట్‌లో ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

విచారణ చేపట్టాలకే బయోమైనింగ్ బిల్లులు

చెత్త నిర్వహణకు సంబంధించి పూర్తీ స్థాయిలో విచారణ చేపట్టాలకే బిల్లులు ఇవ్వాలని మేయర్ వసీం అధికారులకు స్పష్టం చేశారు. సదరు ఏజెన్సీకి రూ.23 కోట్లకు గానూ రూ.9 కోట్లు చెల్లించారని.. ఇక మిగతా బిల్లును లోతుగా పరిశీలించి చెల్లింపులు చేయాలన్నారు. కుక్కల బెడదకు సంబంధించి కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లి 6 నెలలు అవుతోందన్నారు. ఇంత వరకు వాటి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని అసహనం వ్యక్తం చేశారు. తక్షణం కుక్కల బెడదకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. అందుకు కమిషనర్ బాలస్వామి మాట్లాడుతూ.. గతంలో కుక్కలకు స్టెరిలైజేషన్‌కు సంబంధించి ఇక్కడి అధికారులు ఎటువంటి వర్క్ ఆర్డర్ లేకుండానే ఏజెన్సీకు అప్పగించారన్నారు. రూ.44 లక్షలకు గానూ రూ.14 లక్షలు చెల్లించారని పేర్కొన్నారు. వాస్తవంగా వాటి రికార్డు నిర్వహణ సరిగా లేదని తెలిపారు. స్టెరిలైజేషన్ ప్రక్రియను మరో ఏజెన్సీకి కేటాయించేలా రాష్ట్ర అధికారులకు నివేదించనున్నట్లు వెల్లడించారు. రూ.లక్షల్లో అభివృద్ధి పనులు స్టాండింగ్ కమిటీలు ఉంచారని.. తమ డివిజన్‌లలో టెండర్ పిలిచిన పనులను ఇంత వరక చేపట్టకపోవడం దారుణమని సభ్యులు రహంతుల్లా, మల్లెమీద నరసింహులు, సుజాత, అనిల్‌కుమార్ రెడ్డి, నాగ వినూత అధికారులను ప్రశ్నించారు. అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ చంద్రశేఖర్, ఈఈ షాకీర్, నరసింహ, డీఈ దాక్షాయని, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాంజలి తదితరులు పాల్గొన్నారు.

35 అంశాలకు ఆమోదం

బడ్జెట్ అనంతరం నగరంలోని వివిధ డివిజన్లలో అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి స్టాండింగ్ కమిటీలో 35 అంశాలకు ఆమోదం తెలిపారు. 19వ డివిజన్‌లో రూ.21.60 లక్షలతో సీసీ రోడ్డు, కల్వర్టు, రూ.13 లక్షలతో కాలువ, రూ.14 లక్షలతో కాలువ, 30 ట్రాక్టర్లను లీజు పద్ధతిలో చెత్త నిర్వహణకు, 22 సచివాలయాలకు అద్దె చెల్లింపులు, 38వ డివిజన్ కోవూర్ నగర్‌లో రూ.40 లక్షలతో సీసీ కాలువ, రూ.39 లక్షలతో మరో కాలువ, 35వ డివిజన్‌లో రూ.17 లక్షలతో సీసీ రోడ్డు, రూ.23 లక్షలతో సీసీ రోడ్డు, మటన్ మార్కెట్ లీజు తదితర అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.

వ్యవసాయ తోటలో అగ్ని ప్రమాదం



కాలిపోయిన వివిధ వస్తువులు

రాప్తాడు రూరల్: మన్నీల గ్రామానికి చెందిన మాజీ డీలర్, రైతు రాంప్రసాద్‌కు చెందిన వ్యవసాయ తోటలో షార్ట్‌సర్క్యూట్ చోటుచేసుకుంది. సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. రైతు రాంప్రసాద్ 6 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని అరటి సాగు చేశాడు. దీనిపక్కన తన 2.50 ఎకరాల్లో కర్బూజా సాగు చేసేందుకు ఏర్పాట్లు చేసుకున్నాడు. ఇందుకు సంబంధించిన మెటీరియల్ మొత్తం తెచ్చుకుని షెడ్డులో ఉంచుకున్నారు. సోమవారం కరెంటు రవ్వలు పడి మంటలు వ్యాపించాయి. నిముషాల వ్యవధిలోనే షెడ్డులో ఉన్న వస్తువులన్నీ కాలిపోయాయి. డ్రిప్ వైరు, మల్చింగ్ పేపరు, డ్రిప్ బ్యాగులు, రెండు మోటార్ స్టార్టర్ పెట్టెలు, మూడు పోళ్లకు అవసరమైన కరెంట్ వైరు, స్ప్రెయిర్ తదితర వస్తువులన్నీ కాలిపోయాయి. కళ్లెదుటే షెడ్డులో వస్తువులన్నీ కాలిపోవడంతో బాధిత కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం



కలెక్టరేట్ వద్ద రిలే దీక్షలు చేపట్టిన శ్రీసత్యసాయి నీటి సరఫరా కార్మికులు

అనంతపురం అర్బన్: బకాయి వేతనాలు, పీఎఎఫ్, తదితర సమస్యలు పరిష్కరించాలంటూ శ్రీసత్యసాయి నీటి సరఫరా పథకం కార్మికులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలేదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ.. కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. బకాయి వేతనం, పీఎం చెల్లించాలని కోరారు. సత్యసాయి వాటర్ స్కీమ్ బడ్జెట్ నెలకు రూ.2.10 కోట్లు ఉంటే ప్రస్తుత బడ్జెట్ కేటాయింపు లేదన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, నాయకులు కృష్ణమూర్తి, రామాంజనేయులు, భాస్కర్, నాగరాజు, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నరేష్, శ్రీరాములు, నాయకులు మధు, రమేష్ రెడ్డి, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు'కు తరలిరండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, తదితరులు



మాట్లాడుతున్న పార్టీ యువజన విభాగం నగరాధ్యక్షుడు శ్రీనివాస్ దత్తా

అనంతపురం ఎడ్యుకేషన్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల కోసం విద్యార్థుల తల్లిదండ్రులపై కళాశాలల యాజమాన్యాలు తీవ్ర ఒత్తిళ్లు చేస్తున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదని డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య మండిపడ్డారు. వైస్సార్ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని వివిధ కళాశాలల్లో విద్యార్థులకు 'యువత పోరు' ర్యాలీపై అవగాహన కల్పించారు. వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వాసంతి సాహిత్య మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అండగా ఉండేందుకే వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12న 'యువత పోరు' నిర్వహించి ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగా అనంతపురంలో జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యక్రమానికి విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చి మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. విద్యార్థి, మైనారిటీ విభాగాల అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, సైపుల్లా బేగ్ మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. విద్యార్థి, మహిళ, మైనార్టీ విభాగాల నగర అధ్యక్షులు కై లాష్, సాకే చంద్రలేఖ, మన్సూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు జావీద్, విశాల రెడ్డి, విద్యార్థి విభాగం నిశాంత్ రెడ్డి, రాహుల్ రెడ్డి, శేఖర్, ధర్మ, సూర్య, శ్రీను, రాజా పాల్గొన్నారు.

ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం

అనంతపురం కార్పొరేషన్: యువత పోరుకు యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలిరావాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నగరాధ్యక్షుడు శ్రీనివాస్ దత్తా పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం యువతపై వ్యవహరిస్తున్న నిరంకుశ ధోరణికి బుద్ధి చెప్పేందుకు సమాయత్తమవుదామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వైద్య కళాశాలల ఏర్పాటు, నిరుద్యోగ భృతి మంజూరు చేయాలన్నారు. న్యాయబద్ధంగా విద్యార్థులకు పథకాలు వర్తింపజేయాలన్నారు. నాయకులు ఆసిఫ్, దాదు, లబ్బే రాఘవ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యాపారుల దోపిడీ

- రూ.10 బిస్కెట్ ప్యాకెట్ రూ.15కు విక్రయం
- మందలించిన ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు



వ్యాపారి నుంచి డబ్బును తిరిగి ఇప్పిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం: ఆర్టీసీ బస్టాండ్‌లో వ్యాపారుల్లో మార్పు కనిపించడం లేదు. ఎన్నిమార్లు హెచ్చరికలు చేసినా అదే ధోరణితో వ్యవహరిస్తున్నారు. అధిక ధరలకు విక్రయించి ప్రయాణికుల జేబుకు చిల్లేస్తున్నారు. సోమవారం బుక్కరాయసముద్రానికి చెందిన ఓ మహిళా కానిస్టేబుల్ బిస్కెట్ ప్యాకెట్ కొనుగోలు చేసింది. దానిపై ఎంఆర్‌పీ ధర రూ.10 ఉంది. సదరు వ్యాపారి మాత్రం ఆమెను రూ.15 ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ధర ఎంతుంటే అంతే ఇస్తారు.. అధికంగా డబ్బులు డిమాండ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. సదరు వ్యాపారి ఇవ్వాల్సిందే అని డిమాండ్ చేయడంతో చేసేది లేక తను అడిగిన డబ్బు ఇచ్చారు. అనంతరం పక్కనే ఉన్న ఆర్టీసీ విజిలెన్స్ సీఐ విజయ్ కుమార్, స్టేషన్ మేనేజర్ మూర్తికి ఫిర్యాదు చేశారు. స్పందించి అధికారులు సదరు వ్యాపారిని మందలించి డబ్బును తిరిగి ఇప్పించారు. మహిళా కానిస్టేబుల్ అని చెప్పినా వ్యాపారి ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారంటే.. సాధారణ ప్రయాణికుల నుంచి ఏ మేరకు దండుకుంటున్నారో చెప్పాల్సిన అవసరం లేదు.

ఆడిందే ఆట..

ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారులు దోపిడీకి దిగుతున్నారు. ఎంతగా అంటే రూ.10 వస్తువును రూ.15కు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇక తాగు నీటి బాటిళ్లు, తినుబండరాలకు ఏ స్థాయిలో డబ్బు వసూలు చేస్తున్నారో చూస్తే కళ్లు తిరగాల్సిందే. ఇక ఆహార పదార్థాల తయారీలో తీవ్ర నిర్లక్ష్యం, కుళ్లిపోయిన, పాచిపోయిన కూరగాయాలతో వంటలు చేస్తున్నారు. అధికారుల తనిఖీలు కొరవడటంతో ఇక్కడి వ్యాపారులు ఆడిందే ఆటగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అక్రమ డీ పట్టాను రద్దు చేయాలి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు

అనంతపురం అర్బన్: కక్కలపల్లి రూరల్ పంచాయతీ సర్వే నంబర్ 33–1 నుంచి 24 వరకు ఉన్న 40.32 సెంట్లు ప్రభుత్వ డైగ్లాట్‌లో పోరంబోకు భూమిగా ఉందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్నోబులేసు తెలిపారు. ఇందులో 1.50 సెంట్లకు అక్రమంగా జారీ చేసిన డి.పట్టాను రద్దు చేసి, ఆ స్థలంలో అంబేడ్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. సర్వే నంబర్ 33–15ఏ, 15బీలో 1.50 సెంట్లు 1993లో రచేపల్లి తిరుపాల్‌రెడ్డి పేరున డీ పట్టా మంజూరు చేశారన్నారు. వీరి తండ్రి పేరు మీద సర్వే నంబర్ 40లో 3.50 సెంట్లు, 41–1ఏ, 2బీలో కోట్లు విలువ చేసే నాలుగు ఎకరాల భూమి ఉందన్నారు. అనంతపురం నగరం కొవ్వూరు నగర్‌లో 20 సెంట్లలో భవనం ఉందని చెప్పారు. సర్వే నంబర్ 33–15(ఏ)లో కోట్ల విలువ చేసే భూములు, ఆస్తులు ఉన్న భూస్వామికి 1993లో డీ పట్టా ఎలా మంజూరు చేశారనేది అధికారులకే తెలియాలన్నారు. ఇది పూర్తిగా అసైన్డ్ భూమి అని తెలిపారు. ఈ సర్వే నంబర్‌లో సుందరయ్య కాలనీ, నారాయణ రెడ్డి కాలనీ, జాకీరు కొట్టాలు, దండోర కొట్టాలు, ఆదర్శ కాలనీ, సీపీఐ కాలనీ, ఆదర్శ నగర్, తదితర కాలనీలు 40 ఏళ్లగా ఉన్నాయని పేర్కొన్నారు. సర్వే నంబర్ 33–15ఏ, 15బీలో 1.50 సెంట్లకు తిరుపాల్‌రెడ్డి అక్రమంగా పొందిన డీ పట్టాను రద్దు చేయాలన్నారు. ఆ స్థలంలో అంబేడ్కర్ స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

సమాచారం ఇవ్వడం లేదు



కలెక్టర్ వినోద్‌కుమార్‌కు సమస్యను వివరిస్తున్న జ్వాలాపురం శ్రీకాంత్

అనంతపురం అర్బన్: సమాచార హక్కు చట్టం ద్వారా కోరిన సమాచారాన్ని ఆర్టీఓ కార్యాలయ అధికారులు ఇవ్వడం లేదని కలెక్టర్ వినోద్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ ఫిర్యాదు చేశారు. ఫైలు లేదంటూ సమాధానం ఇస్తున్నారని చెప్పారు. కలెక్టర్‌ను సోమవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రొసీడింగ్స్ ఆఫ్ లాండ్ రిఫార్మ్స్ ట్రిబినల్ అనంతపురం ఆన్ సీసీ 2271/7, 1744/75 ఏటీపీ డేటెడ్ 10–3–1977ల నకలు కాపీ కోసం తొలుత గత ఏడాది ఆగస్టు 8న దరఖాస్తు చేశామన్నారు. ఫైలు నా ట్రేస్డ్ అంటూ అక్టోబరు 17న సమాధానం ఇచ్చారన్నారు. ఫైలును ప్రత్యక్షంగా తానే వెతుకుంటానంటూ మరోసారి డిసెంబరు 31న దరఖాస్తు చేసుకున్నాని చెప్పారు. తన దరఖాస్తుకు సరైన సమాధానం ఇవ్వకపోగా.. ఫైలు వెతికేందుకు సమయం కేటాయించలేదని చెప్పారు. ఈ విషయంపై పలుమార్లు రెవెన్యూ డివిజన్ అధికారిని కలిసినా సరైన సమాధానం ఇవ్వడం లేదని తెలిపారు. దీనిపై విచారణ చేయించి ఫైలు అందించేలా చూడాలని కోరారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలి

అనంతపురం: ఉద్యోగం చేయడం కంటే పది మందికి ఉపాధి కల్పించే ఉద్యోగ సృష్టికర్తలుగా ఎదగాలని జేఎన్‌టీయూ అనంతపురం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య అన్నారు. జేఎన్‌టీయూ అనంతపురం, వాద్వాని ఫౌండేషన్ సంయుక్తంగా హ్యుమానిటీస్ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 10 నుంచి 14వ తేదీ వరకు ట్రెన్ ద ట్రైనర్స్ ప్రోగ్రామ్ ఆన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ వెంచర్ క్రియేషన్ అనే అంశంపై శిక్షణ నిర్వహిస్తున్నారు. కార్యక్రమానికి రిజిస్ట్రార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆఫ్రికా, కెనడా, ఆసియా వంటి ఖండాల్లో లక్షలాది మందికి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా వాద్వాని ఫౌండేషన్ శిక్షణ ఇస్తోందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ అకడమిక్ అండ్ ప్లానింగ్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి, ప్రొఫెసర్ టి.నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందువులపై దాడులు దుర్మార్గం



విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టిన దృశ్యం

అనంతపురం కల్చరల్: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హిందుత్వాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించాలని బీజేపీ, హిందూ సంస్థల ప్రతినిధులు సూచించారు. హిందువులపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ సోమవారం విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో నగరంలో భారీ ర్యాలీ చేపట్టారు. స్థానిక కృష్ణకళా మందిరం నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్, పాతూరు నుంచి కలెక్టరేట్ వరకు సాగిన ర్యాలీలో నినాదాలు చేశారు. విశ్వహిందూ పరిషత్తు అధ్యక్షుడు తాళంకి రత్నమయ్య, ఉపాధ్యక్షుడు రమణ, కార్యదర్శి విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ.. ఈనెల 4న రాయచోటిలో వీరభద్రస్వామి పారువేట ఊరేగింపులో హిందువులపై అకారణంగా ముస్లింలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని విచారం వ్యక్తం చేశారు. కానీ పోలీసులు మాత్రం ఆర్ఎస్ఎస్, విశ్వహిందూ పరిషత్తు సంస్థల కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. దీనికి బాధ్యులైన ఎస్ఐ నరసింహారెడ్డి, దేవాలయ ఈఓ రమణారెడ్డిని వెంటనే బాధ్యతల నుంచి తప్పించాలని డిమాండ్ చేశారు. ఘటనపై జ్యుడిషియల్ విచారణ జరపాలని కోరారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని న్యాయం జరిగేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ దక్షిణాంధ్ర భజరంగ్ దళ్ సహ సంయోజక్ రవి కసాపురం, కిషోర్ నాయుడు, సందిరెడ్డి శ్రీనివాసులు, చిరంజీవి రెడ్డి, వెంకటరాముడు, ప్రదీప్, కోనేటి బిందు, సోమశేఖర్, చంద్రమౌళి, విశ్వేశ్వరరెడ్డి, వీహెచ్‌పీ, భజరంగదళ్, హిందూ చైతన్య వేదిక, ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

గీతాదేవికి తెలుగు వెలుగు పురస్కారం



కాసినేని గీతాదేవిని సత్కరిస్తున్న తెలుగు వెలుగు ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: తెలుగు వెలుగు సాహిత్య సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. సోమవారం వేదికల వద్దకు రాలేని పలువురు మహిళల ఇంటి వద్దకే వెళ్లి సత్కరించారు. పుట్టపర్తి నారాయణాచార్యుల సాహిత్యాన్ని అమితంగా అభిమానించి ఆ ఒరవడిలోనే కవిత్వాన్ని సృజియిస్తున్న కాసినేని గీతాదేవిని శాలువా, జ్ఞాపికతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, కవులు జయప్రకాష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ బంకు ఏర్పాటు పేరుతో మోసం

అనంతపురం: పెట్రోల్ బంకు ఏర్పాటు చేయిస్తామని దళితులను మోసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి పేర్కొన్నారు. సోమవారం బాధితులతో కలిసి ఎస్పీ పి.జగదీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆత్మకూరు మండల కేంద్రంలోని పెద్ద సర్దానప్ప, చిన్న సర్దానప్ప అన్నదమ్ములకు సంబంధించిన భూమిలో పెట్రోల్ బంకు ఏర్పాటు చేయిస్తానని నాగేంద్ర అనే వ్యక్తి రూ.81.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని తెలిపారు. నారా లోకేష్‌తో దిగిన ఫొటోలు, అలాగే తన కుమారుడికి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, జేసీ పవన్ రెడ్డితో మంచి పరిచయాలు ఉన్నాయని నమ్మించి డబ్బు కాజేసినట్లు పేర్కొన్నారు. ఏకంగా మలోబిలేశ్వర పెట్రోల్ పంపు అనే పేరుతో నకిలీ సంస్థను ఏర్పాటు చేసి నిండా ముంచేసినట్లు చెప్పారు. అధికారులు స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు.

యూత్ పార్లమెంట్‌లో గిరిజనుల సమస్యల ప్రస్తావన

అనంతపురం: న్యూఢిల్లీలో ఈనెల 9వ తేదీన జరిగిన వికసిత్ భారత్ నేషనల్ యూత్ పార్లమెంట్‌లో ఎస్కేయూ ఏబీవీపీ నాయకుడు దివాకర్ నాయక్ పాల్గొన్నారు. గిరిజన ప్రాంతాల్లో కనీస సౌకర్యాల కొరతపై ప్రసంగించారు. గిరిజన ప్రాంతాల్లో ఏకలవ్య పాఠశాలలు మెరుగుపరిచేందుకు కృషి చేయాలని కోరినట్లు పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఆర్థిక చేయూత

అనంతపురం రూరల్: దివ్యాంగులకు ఆర్థిక చేయూత అందిస్తామని ఐడియా స్వచ్ఛంద సంస్థ

సంక్షిప్త సమాచారం

డైరెక్టర్ పంకజ్ తెలిపారు. ఐడియా, సక్షం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని దివ్యాంగులకు నగరంలోని కోవూరు నగర్‌లో ఉన్న విద్యారణ్య పాఠశాలలో ఈనెల 12 నుంచి నాలుగు రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న దివ్యాంగులకు రూ.22,500 చొప్పున రుణాలు అందిస్తామన్నారు. అర్హులైన దివ్యాంగులు పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకుని శిక్షణకు హాజరు కావాలన్నారు. సక్షం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, స్వచ్ఛంద సంస్థ సభ్యులు వీరం మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

మహాబోధి–మహా విహార్ బౌద్ధులకే అప్పగించాలి

అనంతపురం అర్బన్: మహాబోధి–మహా విహార్ పూర్తిగా బౌద్ధులకు అప్పగించాలని బౌద్ధ, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. ఆల్ ఇండియా బిక్కు సంఘం సభ్యులు పూజ్య బిక్కు సద్గా రఖిత మాట్లాడుతూ.. బిహార్‌లోని బుద్ధగయ మహాబోధి, మహా విహార విముక్తి ఉద్యమానికి మద్దతు తెలియజేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. బౌద్ధుల డిమాండ్‌ను రాష్ట్రపతి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు హరిప్రసాద్, సాకే హరి, మందుల రమేష్, నెరమెట ఎల్లన్న, చంద్ర, శ్రీనివాసులు, రామన్న, నగేష్, ఓబుళేసు, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమలకి ఏకాదశి

అనంతపురం కల్చరల్: రామనగర్‌లోని రుక్మిణీ విఠల పాండురంగ స్వామి ఆలయంలో సోమవారం అమలకి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. భక్తులకు స్వామివారి నిజరూపదర్శనం ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామికి విశేష అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. భావసార క్షత్రియ సమాజ్ భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి నిజరూపదర్శనంలోని రుక్మిణీ పాండురంగడిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

విజయవాడ తరలిన అంగన్‌వాడీలు



సెక్టార్ సమావేశానికి ఎవరూ రాకపోవడంతో కార్యకర్తల కోసం వేచి ఉన్న సూపర్‌వైజర్లు

రాప్తాడు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలంటూ అంగన్వాడీలు విజయవాడలో చేపట్టిన మహా ధర్నాకు మండలంలోని పలువురు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు తరలివెళ్లారు. సోమవారం రాప్తాడు మండలంలో అంగన్‌వాడీ కేంద్రాలు మూతబడ్డాయి. తమ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నిసార్లు నివేదించినా పట్టించుకోకపోవటంతో ఈ ధర్నా చేపట్టినట్లు అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన విధంగా మినీ సెంటర్లను పూర్తిస్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా మార్చాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు.